08ATP08_08ATP08.qxd 08-06-2025 PM 11:39 Page 1



## కాంస్య పథకం సాధించిన సత్యసాయి జిల్లా మహిళ హాకీ జట్టు




మహిళ హాకీ జట్టును అభినందిస్తున్న మేనేజర్ కోచ్ ల

ధర్మవరం,జూన్8(ప్రభాతవార్త)

హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భీమవరం లో గత మూడు రోజు లుగా జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీలలో సత్యసాయి జిల్లా జట్టు కాంస్య సాధించింది. శుక్రవారం జరిగిన మొదటి లీగ్ మ్యాచ్ లో నంద్యాల జిల్లా జట్టుపై 16-0, రెండవరోజు నెల్లూరు జిల్లా జట్టుపై 11-0తిరుపతి జిల్లా జట్టుపై 3-1స్కోరుతో విజయం సాధించి సెమీఫైనల్ చేరుకుంది సెమీ ఫైనల్ మ్యాచ్ అనంతపురం జిల్లా జట్టుతో తలపడి నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1 గోల్స్ తో డ్రాగా ముగిసింది అనంతరం పెనాల్టీ షూట్ అవుట్ లో 3-2 గోల్స్ తేడాతో ఓటమి చెందింది. మూడవ స్థానం కోసం ప్రకాశంజిల్లా సత్యసాయి జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచులో 2-0 గోల్స్ తేడాతో గెలుపొంది తృతీయ స్థానం దక్కించుకుంది, తృతీయ స్థానం సాధించిన సత్యసాయి జిల్లా జట్టుకు ఎమ్మెల్సీ మోషేను రాజు ,హాకీ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్ తదితరులు బహుమతులను అంద చేసారు. సత్యసాయి జిల్లాకు చెందిన హేమ బెస్ట్ డిఫెండర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు దక్కించుకుంది. విజయం సాధించిన జట్టు సభ్యులను, హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బి.సూర్యప్రకాష్ బీ.వీ.శ్రీనివాసులు,బండి వేణుగోపాల్,పళ్లెం వేణుగోపాల్, అంజన్న, గౌరిప్రసాద్, సత్య సాయి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ హస్సేన్ సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలియ జేశారు

## గ్యాంగ్ రేప్ చేసిన ఆ 14 మంది మానవ మృగాలను శిక్షించాలి

-జిల్లా డివిఎంసి సభ్యులు దేవరకొండ ఉమాశంకర్ డిమాండ్



ఉమాశంకర్ (ఫైల్‌ఫోటో)

గోరంట్ల, జూన్ 8 ప్రభాతవార్త

దళిత మైనర్ బాలికపై సామూహికంగా అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డివిఎంసి సభ్యులు దేవరకొండ ఉమాశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన గోరంట్లలో ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా డివిఎంసి సభ్యులు దేవరకొండ ఉమాశంకర్, పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఎడుగుర్రాలపల్లి గ్రామంలో దళిత మైనరు బాలికపై 14 మంది సామూహిక అత్యాచారం చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డివిఎంసి సభ్యులు డిమాండ్ చేశారు. తండ్రి లేని దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేస్తూ ఆ వీడియోలు వైరల్ చేస్తూ ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం చేయడం చాలా సిగ్గుచేటన్నారు. ఈ సంఘటన సభ్య సమాజం తల దించుకొనేలా వుందన్నారు. ఈ సంఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని నిందితులు ఏ పార్టీకి చెందిన ఏ కులానికి చెందిన వారైనా శిక్షించాలని డివిఎంసి సభ్యులు తీవ్రంగా ఖండిచారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా దళిత గిరిజనులను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి వుందని ఈ సందర్భంగా నాయకులు వాపోయారు. దళిత బాలిక కుటుంబానికి రక్షణ కల్పిస్తూ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని సభ్యులు కోరారు. నిందితులకు కఠిన శిక్ష వేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## యోగ ద్వారా మనిషికి మానసిక ప్రశాంతత



యోగ నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం జూన్ 8 ప్రభాతవార్త

మండల పరిధిలో హేమావతి హేంజేరు సిద్దేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ప్రకటించిన యోగాంధ్ర కార్యక్రమం ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెలుగు పిడి నరసయ్య, తహసిల్దార్ లక్ష్మీనరసింహం, వ్యవసాయ అధికారి మంజునాథ్, ఎస్సై ఇషాక్ బాషా తదితరుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా పిడి, ఎంపీడీవో, తహసిల్దార్ లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ యోగ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు దీన్ని ప్రజలు పాటించాలన్నారు. యోగ ద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. ఆధ్వర్యంలో యోగ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు పరిపాలన అధికారి ఆరాధ్య, ఎంపీపీ ఈరన్న, ఏఎస్ఐ రామాంజనేయులు, సర్పంచ్ తిప్పేస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు గొల్ల మారనపల్లి రామచంద్రప్ప, కుమార్ స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, క్లస్టర్ ఇంచార్జి కృష్ణమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు గౌడరంగప్ప, చంద్ర, మూర్తి, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, తిప్పే స్వామి, సర్పంచ్ జితేంద్ర, గ్రామ కార్యదర్శులు నరేష్ బాబు, ఈరన్న, యూనిట్ ఇంచార్జ్ ప్రభాకర్ , చిక్కన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్‌కు ధర్మవరం విద్యార్థులు ఎంపిక

ధర్మవరం,మే8(ప్రభాతవార్త)

ప్రభుత్వం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో (2025 సంవత్సరం) అత్యుత్తమ మార్కులతో ప్రతిభ ఘనపరిచిన జిల్లాలో భాగంగా ధర్మవరంలో ఏడు మంది విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో యు. విష్ణుకాకతీయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, గుర్రం మనోజ్ కుమార్ బి ఎస్ ఆర్ బాలుర మున్సిపల్ హై స్కూల్, సి. హరిహరనాథ రెడ్డిజీవానంద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, టి.శ్రావణిప్రియదర్శిని విద్యా మందిర్, ఎస్ రుత్విక్ రాయల్ పి సి ఎం ఆర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నాగలూర్ గ్రామం, మురళి శ్రీ దుర్గా ప్రియ విశ్వ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, డి వర్షిత్ నాయక్‌జీవన్ జ్యోతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందన్నారు. వీరందరికీ ఆయా పాఠశాల హెడ్మాస్టర్ ద్వారా సమాచారాన్ని అందించడం జరిగిందని తెలిపారు. ఈనెల తొమ్మిదవ తేదీ సోమవారం కొత్తచెరువులో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం మైలేపల్లి గ్రామ సమీపము నందు జిల్లా వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కూడా హాజరవుతున్నట్లు వారు తెలిపారు. విద్యార్థితో పాటు తల్లిదండ్రులు కూడా పాల్గొనాలని వారు తెలిపారు. ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పుస్తకం యొక్క మొదటి పేజీ జిరాక్స్ కాపీని తప్పక తీసుకొని వెళ్లాలని వారు తెలిపారు. అనంతరం షైనింగ్ స్టార్ కు ఎంపిక కాబడిన ఏడు మంది విద్యార్థులను ఎంఈఓ లు అభినందించారు.

## మున్సిపల్ అధికారులు మురికి కాలువల్లో మట్టిని పూర్తిస్థాయిలో తీసివేయాలి

- మున్సిపల్ అధికారులను కోరిన పరిటాల శ్రీరామ్.
- దెబ్బతిన్న మురికి కాలువలను ప్రభుత్వమే నిర్మిస్తుంది:
- మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్



కాలువలపై తొలగించిన స్థలాలను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ధర్మవరం, మే8(ప్రభాతవార్త)

ధర్మవరం తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ధర్మవరం పట్టణంలోని మున్సిపల్ అధికారులు వ్యాపార సముదాయాల ముందు తొలగించిన మురిక కాలువల శిథిలాలను పరిశీలించిన సందర్భంలో స్థానిక వ్యాపారస్తులు వ్యాపార సముదాయాల ముందు మురికి కాలువలను నిర్మించాలని కోరారు. పరిటాల శ్రీరామ్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగానే పరిటాల శ్రీరామ్ సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన మున్సిపల్ కమిషనర్ తెదేపా నాయకులతో కలిసి కమిషనర్ ప్రమోద్ కుమార్ మున్సిపల్ అధికారులైన డి.ఈ వీరేష్ , శ్యానిటరీ ఇన్స్పెక్టర్ శామ్సన్,కేశవులను వెంటబెట్టుకుని పట్టణంలో వ్యాపార సముదాయాల ముందు తొలగించిన శిబిరాలను దెబ్బతిన్న డ్రైన్సును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాల ముందు పెద్ద ఎత్తున నిల్వ ఉన్న చెత్తను మురికి కాలువలు బ్లాక్ అయిన వాటిని స్థానిక తెదేపా నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే దెబ్బతిన్న మురికి కాలువలను నిర్మించడంతోపాటు శ్రీదేవి హాల్ వద్ద కల్వర్టును నిర్మించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కమిషన్ దృష్టికి తెదేపా నాయకులు తీసుకువెళ్లారు. తక్షణమే అందుకు సంబంధించిన ఎస్టిమేషన్స్ రెడీ చేయాలని డి.ఈ వీరేష్ కుమున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. పట్టణంలో మూడు రోజుల్లో వ్యాపార సముదాయాల ముందు తొలగించిన చెత్తను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ తెదేపా నాయకులకు హామీ ఇచ్చారూ. దీంతో పట్టణ వ్యాపారస్తులు తెలుగుదేశం పార్టీ వారికి, మున్సిపల్ కమిషనర్ కు హామీ పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొత్తచెరువు అప్గ్రేడ్ సీఐగా మారుతి శంకర్



సి.ఐ. జిఎం శంకర్

కొత్తచెరువు జూన్ 8 ప్రభాతవార్త

కొత్తచెరువు అప్గ్రేడ్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) గా జి. మారుతి శంకర్ ఆదివారం సర్కిల్ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు ఆయన పుట్టపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో విఆర్ లో ఉండగా డీఐజీ ఆదేశాల మేరకు కొత్తచెరువు అప్గ్రేడ్ సర్కిల్ కి ఇన్స్పెక్టర్ బదిలీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తచెరువు అప్ గ్రేడ్ సర్కిల్ నందు నెలకొన్న సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు ఫిర్యాదు దారుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామన్నారు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు పేకాట మట్కా బెట్టింగ్ నిర్వహించే వారిపై ఉక్కు పాదం మోపు తామన్నారు సర్కిల్ ఇన్స్పెక్టర్ కి స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

## పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ న్యాయం చేస్తుంది

- కార్యకర్తల సమావేశంలో మండల కన్వీనర్ అభిలాష్



మండల కన్వీనర్ అభిలాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి, జూన్ 8 ప్రభాతవార్త

పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ న్యాయం చేస్తుందని లేపాక్షి టిడిపి మండల కన్వీనర్ అభిలాష్ పేర్కొన్నారు. మండలంలోని మైదుగోళంలో ఆదివారం ఆయన కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు మైదుగోళం పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులతో మండల కన్వీనర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ మండల కన్వీనర్‌గా తన ఎన్నికకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. కార్యకర్తే కన్వీనర్ అని, పార్టీలో కష్టపడే ప్రతీ కార్యకర్తకు పార్టీ న్యాయం చేస్తుందన్నారు. అందరూ తనకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం మైదుగోళం టిడిపి నాయకులు నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ అభిలాష్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మైదుగోళం గ్రామ సర్పంచు రామచంద్రరెడ్డి, ఖలీల్, మూర్తి, నాగరాజు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుకో బ్యాంకు నూతన డైరెక్టర్‌గా అరవి చెన్నబసమ్మ

బళ్లారి, జూన్08, ప్రభాతవార్త



అరవి చెన్నబసమ్మ

కర్ణాటక సహకార రంగంలోని అగ్రగామి బ్యాంకుగా ఉన్న సుకో బ్యాంకు నూతన డైరెక్టర్‌గా అరవి చెన్నబసమ్మబసవరాజ పాటిల్ నియమితులయ్యారు. సుకో బ్యాంకు పాలకమండలి చైర్మన్ మోహిత్ మస్కీ, మేనేజింగ్ డైరెక్టర్ రవి సుధాకర్‌లు ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. సుకో బ్యాంకు పాలకమండలి సభలో అరవి చెన్నబసమ్మను నామినేట్ డైరెక్టర్‌గా నియమించినట్లు తెలిపారు. నూతన డైరెక్టర్ సహకార తత్వ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వహించి సుకో బ్యాంకు సమగ్ర ప్రగతికి, అభివృద్ధికి శ్రమిస్తారని తెలిపారు.

## ఆదర్శ పాఠశాలలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

అగళి, జూన్ 8 ప్రభాతవార్త

అగళి ఆదర్శపాఠశాల,జూనియర్ క ళాశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్నటువంటి సీట్లు భర్తీ చేయుటకు, ఇంటర్మీడియెట్ మిగిలిన సీట్లను భర్తీ చేయుటకు దరఖాస్తు చేసుకొనుటకు నోటిఫికేషన్ జారీ చేయడమైందని ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. దరఖాస్తులను ఏపిఎంఎస్ఏపిసిఎస్ఎస్.ఇన్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 20వ తేది ఆఖరు తేది అన్నారు. ఆదర్శ పాఠశాలలో ఈ నెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్‌మిడియెట్ ఫస్ట్ ఇయర్‌లో 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములుకండి

జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆది శేషు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న జే వి వి నాయకులు

ధర్మవరం,మే8(ప్రభాతవార్త)

శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన సభ్యత్వ గోడపత్రికలను బాబు జగ్జీవన్ రామ్ నగర్ లోని శ్రీ సత్య చిన్నపిల్లల హాస్పిటల్ దగ్గర జేవీవీ నాయకులు విడుదల చేసారు.ఈ సంధర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, కోశాధికారి చంద్రశేఖర రెడ్డి , ప్రముఖ చిన్నపిల్లల వైదుడు డాక్టర్ విక్రాంత్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ బాబు మట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాలుగా తెలుగు ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యం చేస్తోందన్నారు.నేడు ధర్మా ధర్మముల మధ్య, సత్యా సత్యముల మధ్య ఘర్షణ జరుగుతున్నది అని తెలిపారు. ఈ ఘర్షణలో బుద్ధి జీవులు ఏ పక్షం వహించాలో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు అని తెలిపారు. చివరకు జ్ఞానం, అజ్ఞానాన్ని సత్యం అసత్యాన్ని తప్పక జయిస్తాయి అని తెలిపారు. 100 సంవత్సరాల క్రితమే కందుకూరి వీరేశలింగం పంతులు అన్నాడని తెలిపారు. పోరాటం ఈనాటికీ కొనసాగుతూనే ఉందన్నారు. జీవుల జన్యు నిర్మాణం గురించి వచ్చే రోగాల గురించి వాటి చికిత్స గురించి ఎంతో ముందుకు వెళ్ళాము కానీ ఇంకా మన సమాజంలో అశాస్త్రీయ భావజాలం రాజ్యమేలుతూనే ఉందన్నారు. దీనికి సైన్సు అందిస్తున్న ఫలితాలు సామాన్యుని వద్దకు చేరకపోవడమేనన్నారు. సైన్సు ఇప్పటికీ పాఠ్య గ్రంథాలలో ఉంది తప్ప జీవన విధానంగా మారలేదన్నారు.సైన్స్ అవగాహన పెంచడం ద్వారా సామాన్యులు సైన్స్ ఫలితాలను అందుకోవాలనే ఆలోచనలో నుంచి రాష్ట్రంలో జన విజ్ఞాన వేదిక ఏర్పడిందన్నారు. మనం చేసే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని ఆటంకపరచే శక్తులు అడ్డుకునే శక్తులు సామాజిక వ్యవస్థలో ఉన్నాయన్నారు. అలాంటి హేతు విరుద్ధ శక్తుల పట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే కర్తవ్యం జనవిజ్ఞాన వేదిక చేస్తున్నదన్నారు.అనేక రంగాలలో మునుపెన్నడూ ఊహించని ఆవిష్కరణలతో శాస్త్ర విజ్ఞానం దూసుకుపోతున్నా, మధ్యయుగాల చాందస సంకుచిత భావాలు ప్రజానీకాన్ని విజ్ఞాన ఫలాలను అందుకోనీయకుండా చేస్తున్నాయన్నారు. ప్రజలకు చేరువగా, ప్రజల కోసం విజ్ఞాన ఫలాలు ఉపయోగపడాలని జనవిజ్ఞాన వేదిక ఆకాంక్షిస్తోందన్నారు.తెలుగు ప్రజల్లో పనిచేస్తున్న అతి పెద్ద ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థగా జనవిజ్ఞాన వేదిక అందరి అభిమానాన్ని పొందగలిగిందన్నారు.అక్షరాస్యత ,సారా వ్యతిరేక ఉద్యమం, కూల్ డ్రింక్స్ వ్యతిరేక ప్రచారం ,ఆరోగ్య ప్రచారం ,పిల్లల్లో సృజనాత్మకత కోసం ప్రయత్నాలు, పర్యావరణం వంటి అంశాలతో పాటు పిల్లలకు సైన్సు పట్ల అభిరుచి పెంచేందుకు చెకుముకి పత్రికను నిర్వహిస్తున్నదన్నారు. మనిషి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించుకునే శక్తి మనిషికే ఉందన్నారు.ఆ సమస్యలకు పరిష్కారాలు కూడా సమాజంలోనే ఉన్నాయన్నారు. సామాజిక అంశాల విశ్లేషణ, అధ్యయనాలను శాస్త్రీయ హేతువాద దృక్పథంతో చేసే ఆలోచనని ప్రజానీకంలో ప్రోది చేయాలన్న ఆశయంతో పని చేసే ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థ జనవిజ్ఞాన వేదికలో సభ్యులు కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఒక ఉన్నతమైన శాస్త్రీయ సమాజ కోసం ప్రజాసైన్స్ ఉద్యమానికి తోడ్పాటు అందించాల్సిందిగా కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు సురేష్, నరేంద్ర బాబు, నాగేంద్ర, ఖలందర్, మల్లికార్జున, మనోహర్, జంగమన్న, వినయ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- తమిళనాడు సేలం జిల్లా వాలపాడిలో జరిగిన దుర్ఘటన.... హగరిబొమ్మనహళ్లివాసుల మృత్యువాత



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హగరిబొమ్మనహళ్లికి చెందిన రాణాపటేల్ కుటుంబ సభ్యులు

బళ్లారి, జూన్08, ప్రభాతవార్త

విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి పట్టణంలోని పటేల్ ఎలక్ట్రికల్, జగదాంబ బట్టల దుకాణం యజమాని రాణాపటేల్, జోగి రామాపటేల్ ఆయన భార్య ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా వాలపాడిలో జరిగింది. మృతవర్తకులు రాణాపటేల్(52), జోగ రామ(62), ఆయన భార్య చోపిదేవి(55), వారి సమీప బంధువు అక్కడికక్కడే మృతిచెందారు. హగరిబొమ్మనహళ్లి నుంచి వీరంతా శుక్రవారంనాడు తమ ఇన్నోవా కారులో ఏడు మంది తమిళనాడులోని ఈరోడ్‌లో గల బంధువుల గృహ ప్రవేశ కార్యక్రమానికి బయలుదేరారు. శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో వాలపాడి వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనం రోడ్డు పక్క డివైడర్‌కు ఢీకొంది. అత్యంత వేగంతో డివైడర్‌ను ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా గాయపడిన రాణాపటేల్, భార్య చోపిదేవితో పాటు ముగ్గురిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స ఫలించక మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో పట్టణంలోని వ్యాపారులు తీవ్ర దిగ్భ్రాంతి చెంది సంతాపం వ్యక్తం చేశారు. బంధువర్గాల్లో విషాధం నింపింది.

## విద్యార్థినిని గర్భవతిని చేసిన నింధితులను తక్షణమే అరెస్టు చేయాలి

- ఎమ్మార్పిఎస్ నాయకులు చిన్న జలాలపురం ఓబులేసు



చిన్నజలాలపురం ఓబులేసు

శింగనమల, జూన్ 8 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో 9వ తరగతి విద్యార్థినిని దాదాపు 12 మంది యువకులు బలవంతంగా అత్యాచారం చేసి గర్భవతిని చేసిన నింధితులను తక్షణమే అరెస్టు చేసి ఫోక్సో కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పిఎస్ నాయకులు చిన్న జలాలపురం ఓబులేసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. ఈ సంఘటనలో ఎంతటి వారు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని ఇటువంటి కీచకులకు శిక్షలు పడకుంటే ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం అవుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ తాలూకా అధ్యక్షులు కరెంటు నల్లప్ప, మండల కార్యదర్శి మురళీ, కోశాధికారి రాము, మండలాధ్యక్షులు ఎం.సురేష్, టి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కారు ద్విచక్ర వాహనం డీ వ్యక్తి మృతి...

నంబులపూలకుంట, జూన్ 8 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నంబుల పూలు కుంట మండలంలోని ముక్కంవారిపల్లి వద్ద క్వాలిస్ వాహనం ద్విచక్ర వాహనం ఆదివారం మధ్యాహ్నం ఢీ కొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంటే వారిని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ సంఘటన విషయాలు వెలుగు లోకి రావాల్సి ఉన్నాయి. చనిపోయిన వ్యక్తి, క్వాలిస్ వాహనం వారి వివరాలు తెలియాల్సి ఉంది.

## మహిళల, బాలికల, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం

ఎమ్మార్పీఎస్ అనంతపురం శ్రీ సత్య సాయి ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు

శెట్టూరు. జూన్. 08. ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజలకు మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోతుంది, ఎక్కడ చూసినా దళితులపైనే దాడులు దౌర్జన్యాలు, అత్యాచారాలు, జరుగుతూనే ఉన్నాయి, రాష్ట్రంలో దళిత మహిళా హోం శాఖ మంత్రివర్యులు ఉండి కూడా, దళితులకురక్షణ కల్పించడంలో పూర్తిగా విపులమైతున్నారు, శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో దళిత బాలికపై14 మంది సామూహిక అత్యాచారం, అత్యంత దారుణం, పాశవికం,అని ఎమ్మార్పీఎస్ అనంతపురంశ్రీసత్య సాయి ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు టైగర్ వన్నూరుస్వామి మాదిగ తీవ్రంగా ఖండిస్తూ, సభ్య సమాజం తలదించుకునే ఘటన అని విలేకరుల సమావేశంలో తెలియజేశారు, ఈ దురాగతానికి పాల్పడిన దోషులనువెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుస ఘటనలు చూస్తుంటే,,ఎస్సీ,ఎస్టీ,బిసి మైనారిటీ మహిళలకు బాలికల,మాన, ప్రాణాలకు పూర్తి రక్షణ లేకపోతుంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళిత మహిళహోం మంత్రి రాప్తాడు మహిళ ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా మహిళా ఎస్పీ అందరూ మహిళలు అయ్యిఉండి కూడా,, దళిత బాలిక అత్యాచార ఘటనపై స్పందించకుండా మహిళలు అండగా నిలబడకుండా,, మౌనంగాఉండిపోవడం చాలా బాధాకరమని, రాష్ట్రంలో దళితులపై, దళిత మహిళల,బాలికలపై అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు తరచూ జరుగుతూ ఉంటే, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు, హోం మంత్రి అనిత గార్లకు ఇలాంటి అత్యాచార దారుణాలు కనిపించడం లేదా,మహిళలకు రక్షణ అంటే ఇదేనామౌనం వీడి, ప్రజలకు సమాధానం చెప్పాలని, ఎమ్మార్పీఎస్ అనంతపురం శ్రీ సత్య సాయి ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు టైగర్ వన్నూరుస్వామి మాదిగ పత్రికా ప్రకటనలోడిమాండ్ చేయడం జరిగింది,ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనంతపురం పార్లమెంటు అధ్యక్షులు చింతర్లపల్లి గౌరయ్య మాదిగ, చింతర్లపల్లి మాజీ సర్పంచ్ బాబురావు,కళ్యాణదుర్గం మండలం అధ్యక్షులు జెన్ని సురేష్ బాబు మాదిగ, సెట్టూరు మిద్దెసుధాకర్, ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చెర్లోపల్లి ఖాసింసాబ్, లక్ష్మంపల్లి రోజావలి, చింతరపల్లి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అర్చకుడు నరసింహ బట్టర్ మృతి తీరని లోటు

- మాజీ మంత్రి రఘువీరారెడ్డి




మాజీ మంత్రి రఘువీరా పరామర్శిస్తున్న దృశ్యం

అమరాపురం జూన్8 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలో ప్రముఖ దేవాలయాల్లో ప్రధాన అర్చకుడైన నరసింహ బట్టర్ మృతి తీరని లోటని భౌతిక కాయానికి పూలమాలవేసి మాజీమంత్రి సిడబ్ల్యుసి సభ్యుడు రఘువీరా రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దహన సంస్కారాలకు గాను మాజీ మంత్రి ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుధాకర్, ప్రభాకర్ రెడ్డి, గురుమూర్తి, శ్రీనివాస్ రెడ్డి,చిత్ర శేఖర్ యాదవ్ ,వడ్డే హనుమంతు ,బసవరాజ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న అర్చకుడి భౌతిక కాయనికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వైకాపా ఎంపీటీసీ నాగభూషణ్ ఆ కుటుంబాన్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి యువ నాయకుడు కేఎన్ఎం సురేష్ కుమార్ యాదవ్, వాదిరాజ్ తదితరులు అర్చకుడి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు హరీష్ బట్టర్, నరేష్ బట్టర్ లను ఓదార్చారు.

## టీబీ డ్యాంకు నూతన క్రస్ట్ గేట్లు అమర్చాలంటూ తుంగభద్ర రైతుసంఘం వినతి



టీబీ డ్యాం బోర్డు అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ

బళ్లారి, జూన్08, ప్రభాతవార్త

తుంగభద్ర జలాశయం 33 గేట్లను వెంటనే మార్చి కొత్త గేట్లను అమర్చాలని తుంగభద్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు టీబీ బోర్డు కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ నారాయణ్‌నాయక్‌ల సమక్షంలో వినతి పత్రాన్ని తుంగభద్ర రైతుసంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ, పదాధికారులు అందజేశారు. ఇప్పటికే జలాశయంలో 22 టీఎంసీల నీరు వచ్చి చేరిందని, మలినాడు ప్రాంతంలో ఉత్తమ రీతిలో వర్షాలు కురుస్తుండడం వల్ల జలాశయానికి మరింత వరదనీరు వచ్చి చేరుతుందని, గేట్ల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించినా వాటిని నిర్మించేందుకు ఆరు నెలల వ్యవధి పడుతుందని, వచ్చే సంవత్సరం గేట్లను అమర్చుతామని ప్రకటన చేశారని, 19వ గేటుకు అమర్చిన స్టాప్ లాగ్ గేట్‌ను మార్చి దాని స్థానంలో కొత్త గేటును అమర్చుతున్నారని, కావునా జలాశయంలో 80 శాతం మేరకు నీటిని మాత్రమే నీటిని సేకరించాలని ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడు సూచించాడని, ఆ మేరకు రైతులకు జూన్‌లోనే హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ కాలువకు నీరు వదలాలని కోరారు. బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు జిల్లాల ప్రజాప్రతినిధులు, రైతు నాయకుల సభ జరిపి నూతన గేట్లను అమర్చే ప్రక్రియ పనులు ఎప్పుడు మొదలు పెట్టేది? ఎప్పుడు పూర్తి చేసేది? రైతులకు తెలపాలని, రైతుల భూములకు ఈ సంవత్సరం ముందుగానే నీరు వదిలి ఆదుకోవాలని పురుషోత్తంగౌడ విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంలో కొంచిగేరి మల్లప్ప, ఎం.వీరభద్రనాయక్, ఎం.రామాంజినేయనాయక్, అంగడి రాజేగౌడ, గాదిలింగమూర్తి, బసవన్నగౌడ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే అమిలినేని



నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం రూరల్ జూన్ 8 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ హనుమప్ప ఆహ్వానం మేరకు ఆదివారం రోజున ఆయన నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే సురేంద్రబాబు అనంతరం అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గొల్ల ఎర్రిస్వామి గుండె శాస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న ఆయనని టిడిపి సీనియర్ నాయకులతో కలసి పరామర్శించి ధైర్యంగా ఉండాలని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాజశేఖర్ ఇతరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశానికి హాజరైన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



గృహప్రవేశానికి హాజరైన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

**కళ్యాణదుర్గం రూరల్ జూన్ 8 ప్రభాతవార్త**

వైసీపీ నాయకుడు జానకి రాముడు ఆహ్వానం మేరకు కళ్యాణదుర్గం మండలం దాసంపల్లి గ్రామంలో ఆదివారం రోజున గృహప్రవేశం కార్యక్రమానికి వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటమిరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, జిల్లా సాంస్క ృతిక విభాగం కార్యదర్శి నారాయణరెడ్డి, బోయలపల్లి మల్లన్న, కామక్కపల్లి రామాంజి నేయులు,, సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, వెంకటంపల్లి తిమ్మారెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలలో పాల్గొన్న మండల కన్వీనర్



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

**బ్రహ్మ సముద్రం జూన్ 8 ప్రభాతవార్త**

మండల పరిధిపరిధి లోని బైరసముద్రం గ్రామం నందు లింగయ్య ఆహ్వాన మేరకు గౌరవనీయులు కళ్యాణ్ దుర్గం శాసనసభ్యులు సురేంద్ర బాబు ఆదేశాల మేరకు లింగమయ్య వారి కుమార్తె అనసూయమ్మ వెడ్స్ హరీష్ వివాహ వేడుకకు మండల పార్టీ కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు హాజరై నూతన వధువు వరువు లను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో సంతే కొండాపురం సర్పంచ్ మల్లెల వనిత మల్లికార్జున , క్లస్టర్ ఇంచార్జ్ 2, నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు అధ్యక్షుడు అంకె ఎర్రి స్వామి లక్ష్మన్న సోము సిద్దయ్య, డీలర్ సీనప్ప మంజునాథ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ నాయకులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

**బ్రహ్మసముద్రం జూన్ 8 ప్రభాతవార్త**

బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రం, కపాటలింగన పల్లి, పోలేపల్లి గ్రామాల్లో రామాపురం లింగమయ్య, జంగలి నాగరాజు, కే మంజునాథ్ ల ఆహ్వాన మేరకు వారి కుమార్తె, కుమారులు అనసూయమ్మ వెడ్స్ హరీష్ లక్ష్మి (మానస) వెడ్స్ మైలారి వివాహాలకు మాజీ జెడ్పీటీసీ మాజీ మండల కన్వీనర్ కురుబ వెంకటేషులు, మాజీ సర్పంచ్ దండు సత్యనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సిఐ మనోహర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**గుంతకల్లు, జూన్ 8 ప్రభాతవార్త**

రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిఐ బి.మనోహర్‌కు ఫిర్యాదు లేఖను అందచేశారు. ఓ టివి ఛానెల్ చర్చా వేదికలో యాంకర్‌గా వ్యవహరించిన జర్నలిస్టు మరో జర్నలిస్టు చేత వేశ్యల రాజధాని అంటూ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడించారని పేర్కొన్నారు. మీ ఇంటి ఆడపడుచులను కూడా వేశ్యలుగా చూస్తున్నారా అంటూ మండిపడ్డారు. వైసిపికి చెందిన పలువురు రాజధానిపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. అసభ్యకర వ్యాఖ్యలతో మహిళలను అగౌరపరిచిన వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సరోజ, అంజలి, అరుణ, మెహరున్నీసాబేగం, అర్షియాబేగం, మహాలక్ష్మి, ఇందిరమ్మ, చిట్టెమ్మ, విద్యారాణి, తదితరులు వున్నారు.

## పాదయాత్రకు భారీ ట్రాక్టర్ ర్యాలీ

### సంఘీభావం తెలియజేసిన రైతులు

### ఉమ్మడి జిల్లాల వైఎస్ఆర్సిపి నాయకులు

**శెట్టూరు. జూన్. 08. ప్రభాతవార్త**

ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ రెన్యూవల్ డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన "ఆర్‌డిటి పరిరక్షణ పాదయాత్ర"కు అనంతపురం వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు. అనంత వెంకటరామిరెడ్డి. ఎమ్మెల్సీలు వై శివరామిరెడ్డి, మంగమ్మ, వైసీపీ ముఖ్య నాయకులు. మహాలక్ష్మి శ్రీనివాస్. మాదినేని ఉమామహేశ్వర నాయుడు, చవ్వా రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, నాగేశ్వర్ రెడ్డి సంఘీభావం తెలియజేసి పాదయాత్రలో పాల్గొన్నారు తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర ఐదో రోజు బచ్చేహళ్లి నుండి ప్రారంభమై కైరేవు. చెర్లోపల్లి లక్ష్మంపల్లి గ్రామానికి చేరుకుంది ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో త్రీళిదిశ నాయకులు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా వరప్రదాయని ళిదిగి స్వచ్ఛంద సంస్థకు నీదిళితి రెన్యూవల్ చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.ళిదిగి సంస్థ కోసం తలారి రంగయ్య పాదయాత్ర చేయడం గొప్ప విషయమని, పేద ప్రజల పట్ల, కళ్యాణదుర్గం ప్రాంతం పట్ల తలారి రంగయ్యకు చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని త్రీళిదిశ నేతలు కొనియాడారు నీదిళితి రెన్యూవల్ చేసి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో. శెట్టూరు వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు ఎంపీపీ సోమనాథ్ రెడ్డి వైస్ ఎంపీపీ ముత్యాలు. సర్పంచ్లు లు. రామాంజనేయులు విరుపాక్షి గౌడ్ పూజారి చిట్టెమ్మ. ప్రకాష్ గొర్ల గంగాధర్. వైయస్ఆర్సీపీ అనుబంధ విభాగ నాయకులు. ముచ్చర్లపల్లి విజయ్ కుమార్ మిద్దె.సుధాకర్ . ఇమామ్ వలి. చెర్లోపల్లి కాశీ. నాయకులు. టైగర్ వ న్నావు స్వామి. విరుపాక్షి ప్రసాద్ గజ్జి వన్నూరు స్వామి. రోజా వల్లి. ఎర్రబోరేపల్లి వెంకటరమణ. మహేష్. వన్నూరు స్వామి. మరియు వివిధ మండలాల కన్వీనర్లు ఎంపీపీలు జడ్పిటిసిలు ఎంపిటీసీలు సర్పంచులు మహిళా సంఘాల సభ్యులు రైతులు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మానవత్వాన్ని చాటుకున్న రెవెన్యూ డివిజనల్ అధికారి

**శెట్టూరు, జూన్ 08, ప్రభాతవార్త**

శెట్టూరు మండలం మంగంపల్లికి చెందిన పూజారి ఆంజనేయులు కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కరోనా సమయంలో భార్య అంజలి మృతి చెందింది. అప్పటినుంచి ఇద్దరు పిల్లల్ని అన్ని తానే చూసుకుంటున్న తండ్రి ఆంజనేయులు శనివారం గుండెపోటుతో మృతి చెందారు. తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో వారి ఇద్దరు కుమారులు అనాథలుగా మిగిలిపోయారు మృతదేహం వద్ద ఆపన్న హస్తము కోసం పిల్లలు ఎదురు చూస్తున్నారు. కనీసం తండ్రిని ఖననం చేసేందుకు కూడా వారి వద్ద డబ్బుల్లేని దీన పరిస్థితి పెద్ద కుమారుడు త్రిలోకనాథ్, తొమ్మిదవ తరగతి, చిన్న కుమారుడు సాయినాథ్, ఎనిమిదవ తరగతి, చదువుతున్నారు. వారి దీన పరిస్థితిని చూసి మానవతావాదం తో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీ జి వసంత బాబు , ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, చిన్నారుల మనసులలో ఆత్మ ఆత్మస్థైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం తహసీల్దార్ భాస్కర్ మరియు ళిదివీ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు

## రైతులకు సబ్సిడీతో డ్రోన్ పంపిణి



డ్రోన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**రాయదుర్గం జూన్ 08, ప్రభాతవార్త**

ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో నూతన కమిటీ ప్రమాణం కార్యక్రమం లో భాగంగాస్థానిక ఎమ్మెల్యేకాల్వ శ్రీ నివాసులు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీతో విత్తనాలు, డ్రోన్ పంపిణి చేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతు వ్యవస్థ ను నిర్వీర్యం చేశారని కూటమి ప్రభుత్వ రైతులకు 90 శా తం సబ్సిడీ తో డ్రిప్ ఇతర వ్యవసాయం పనిముట్లు అందిస్తుందన్నారు ఈ కార్యక్రమం లో వ్యవసాయ ఉప సంచాలకులు లక్ష్మ నాయక్ మండల వ్యవసాయదికారి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు గురువులను సన్మానిస్తున్న దృశ్యం

**కంబదూరు, మే 08, ప్రభాతవార్త**

కంబదూరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి గురువులను శాలువ, పూలమాలలతో సన్మానించారు, అనంతరం వారు తీపి కబుర్లను గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమర్నాథ్, ఉపాధ్యాయులు రామాంజనేయులు, భీమన్న, నాగరాణి, హనుమంత రాయుడు, అనిల్ కుమార్, రామచంద్ర, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి ఈడిగ రమేష్ విరాళం



ఈడిగ రమేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 8 ప్రభాతవార్త**

లేపాక్షి పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి లేపాక్షికి చెందిన ఈడిగ అంజనప్ప కుమారుడు లేపాక్షి తెలుగుదేశం పార్టీ నాయకుడు ఈడిగ రమేష్ 50 వేల రూపాయలను ఆదివారం ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులకు విరాళంగా అందచేశారు. నిర్మాణం పూర్తయిన దశలో సహాయ సహకారాలతో పాటు మరింత వస్తువు రూపంలో కూడా సహకారం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి మండల జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రానైట్ క్వారీలో చోరీకి పాల్పడిన దుండగులు

**కంబదూరు, జూన్ 08, ప్రభాత వార్త**

కంబదూరు మండల కేంద్రంలోని దుర్గం కొండ గ్రానైట్ క్వారీలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు క్వారీ సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. క్వారీ ఆఫీస్ తలుపులు పగలగొట్టి మిషనరీ పరికరాలకు సంబంధించిన విలువైన బ్యాటరీలు, సీసీ కెమెరాలు ,కేబుల్ వైర్లు ఎత్తుకెళ్లారని మీడియాకు తెలియజేశారు. సుమారు వాటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందన్నారు . భోజనానికి ఇంటికి వెళ్ళిన సమయంలో చోరీ జరిగిందని చెప్పారు.ఇదే విషయమై క్వారీ సెక్యూరిటీ సిబ్బంది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తుంది.

## వైభవంగా బసవేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

**విడపనకల్లు, జూన్ 08, ప్రభాతవార్త**



నూతనంగా ప్రతిష్ఠాపించిన మహాత్మా శ్రీ బసవేశ్వరుని విగ్రహం

మండలంలోని ఉండబండ గ్రామంలో ఆదివారం మహాత్మా శ్రీ బసవేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ శ్రీ రాజేంద్ర కరిబసవ స్వామి గారి పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవానికి నాగణహళ్లి స్వాములు శ్రీ కుమార స్వామి, శ్రీ శరణు స్వామి, శ్రీ మహంతి స్వామి, విగ్రహ శిల్పి సందీప్ కుమార్, నియోజకవర్గ వీరశైవ సంక్షేమ సమాజం అధ్యక్షులు పి.నగన్న గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ, జగజ్యోతి బసవేశ్వరుని వచనాలను, ఆయన పాటించిన వీరశైవ ధర్మాన్ని ఇప్పటి తరం వారు కూడా ఆచరించినప్పుడే వీరశైవ ధర్మాన్ని కాపాడినవారు అవుతారని ఉద్ఘాటించారు. ఉరవకొండ నియోజకవర్గం లోనే మొట్టమొదటిసారిగా ఉండబండ గ్రామంలో జంగమ లింగాయత్ సమాజం వారు ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఈ గ్రామంపై ఆ బసవేశ్వరుని కృప కటాక్షాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ సభ్యులు వినోద్ కుమార్, భరత్ కుమార్, మహేంద్ర, నాగేంద్ర స్వామి, బండే గౌడ, శివకుమార్, వీరభద్ర గౌడ్ తో పాటు నియోజకవర్గ వీరశైవ సంక్షేమ సంఘము సభ్యులు చీకులగురికి బొజ్జప్ప, ప్యాపిలి సత్యనారాయణ, మోపిడి చంద్ర, టీచర్ లోకేష్, పాటిల్ నిరంజన్ గౌడ్, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని వినతి

**గుత్తి, జూన్ 8 ప్రభాతవార్త**



వినతి పత్రం అందచేస్తున్న దృశ్యం

పట్టణంలోని కోట ప్రాంతంలో వున్న పురాతన రామస్వామి దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని బిజెపి ఎంఎల్‌సి సోము వీర్రాజుకు ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణలోని భద్రాచలం తరహాలోని ఆలయంలో స్వాములవారి విగ్రహాలు వున్నాయని తెలిపారు. ఈ మేరకు ఆయన తనవంతు సహకారం అందచేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శివప్రసాద్, కార్యదర్శి ఎంకె చౌదరి, చక్రపాణి, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు ఒకచోట చేరిన దృశ్యం

**గుత్తి, జూన్ 8 ప్రభాతవార్త**

పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 1999-2000 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు తమ రజతోత్సవ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. 25 సంవత్సరాల కిందట 10వ తరగతి చదివిన వారు ఒకచోట చేరడంతో తిరిగి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గత స్మృతులు, తీపి జ్ఞాపకాలు, పరస్పరం గుర్తు చేసుకుని ప్రస్తుతం వారు స్థిరపడ్డ వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ సర్కిల్ నుండి గాంధీచౌక్ మీదుగా కళాశాల వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు కిరణ్, రాజేంద్రప్రసాద్, శ్యామ్, నథానియల్, విజయశేఖర్, బాలశౌరి, అమృత, రూబికా, కమిలిని, నిర్మల, సిబ్బంది ఆంజనేయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ధృవీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించవద్దు



మాట్లాడుతున్న తహశీల్దార్ ఓబులేసు

**గుత్తి, జూన్ 8 ప్రభాతవార్త**

రెవెన్యూ కార్యాలయంలో తమ ధృవీకరణ పత్రాల కోసం రైతులు, ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు దళారులను ఆశ్రయించవద్దని మండల తహశీల్దార్ ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకాలు, వాల్టా ధృవీకరణ పత్రాలు, నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లు, నిరుద్యోగ ధృవీకరణ పత్రాలు, ఇడబ్ల్యూఎస్, లీగల్ ఫ్యామిలీ హెయిర్ సర్టిఫికెట్ తదితర వాటి మంజూరు కోసం తమ శాఖ సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించ రాదన్నారు. కార్యాలయ సిబ్బంది, విఆర్‌ఒలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తనకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

## లైన్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

### - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు



మాట్లాడుతున్న బి.శ్రీనివాసులు

**గుంతకల్లు, జూన్ 8 ప్రభాతవార్త**

కాంట్రాక్ట్ కార్మికుడి ప్రమాదానికి కారకుడైన లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ లైన్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యానికి కాంట్రాక్ట్ కార్మికుడు మస్తాన్ తీవ్ర గాయాల పాలు కావడం జరిగిందన్నారు. ఎల్‌సి (లైన్ క్లియర్) తీసుకున్న తరువాత లైన్ ఇన్‌స్పెక్టర్ సరిచూసుకోకుండా బాధ్యతారహితంగా ప్రవర్తించి ప్రమాదానికి కారకుడయ్యారని ఆరోపించారు. ప్రమాదం జరిగి రెండు రోజులు కావస్తున్నా అధికారులు ఇంకా కాంట్రాక్ట్ కార్మికున్ని ప్రభుత్వ ఆసుపత్రిలోనే వుంచడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. చేతి వేళ్ళు తెగిపోయి, కాలు బాగా దెబ్బతిని నడుము విరిగిన కార్మికుడిని అలా వదిలేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్మికుడిని వెంటనే కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి కార్మికులు బలవుతున్నారన్నారు. గతంలో కూడా సత్యనారాయణపేటలో రాజు అనే కాంటాక్ట్ కార్మికుడు అధికారుల నిర్లక్ష్యానికి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడని గుర్తు చేశారు. కార్మికుల ప్రాణాలు అంటే చులకన భావంతో చూసే ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మస్తాన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.

## రాజధాని అమరావతిపై విషం చిమ్ముతున్న జగన్ అండ్ కో..!

### -వైసీపీ అనుకూల పత్రిక ప్రతులను దగ్ధం



చిత్రపటాలతోపాటు వైసీపీ అనుకూల పత్రిక ప్రతులను దగ్ధం చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జూన్ 8 ప్రభాతవార్త**

ఎంతో పురాణ ప్రాశస్త్యం కల్గిన రాజధాని అమరావతిపై జగన్ అండ్ కో విషం చిమ్ముతూ దుష్ప్రచారాలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు మండిపడ్డారు. మహిళల శీల హననం చేసేలా అమరావతిలో అధికంగా వున్న బీసీ, ఎస్సీలను అవమానించేలా వేశ్యల రాజధాని అని తన సొంత ఛానల్ చర్చలో మాట్లాడించడం దారుణమంటూ ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంవద్ద మహిళా విభాగం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు కేఎస్ఆర్, కృష్ణంరాజు చిత్రపటాలతోపాటు వైఎస్ా ్ర రసీపీ అనుకూల పత్రిక ప్రతులను చెప్పులతో కొట్టి కాలికిందవేసి నలిపివేసి కాల్చివేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వి.సుంకరత్నమ్మ తదితరులు మాట్లాడుతూ ఆచార్య నాగార్జునుడు ప్రపంచస్థాయి విశ్వ విద్యాలయం నిర్వహించిన, ప్రముఖ బౌద్ధ క్షేత్రం, శాతవాహనుల రాజధాని అమరావతిని నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటించినప్పటి నుంచి జగన్ నీచాతినీచమైన దుష్ప్రచారాన్ని చేయిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన వెంటనే రాష్ట్ర ప్రజలకు, మహిళలకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు తులసమ్మ, గంగమ్మ, సోమావతి, సునీత, పార్వతి, రబియా, ఆయిషాలతోపాటు టీడీపీ ఉరవకొండ, వజ్రకరూరు మండలాల అధ్యక్షులు ఎన్.విజయభాస్కర్, నూతేటి వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, ఇంద్రావతి మాజీ సర్పంచ్ యర్రగుంట్ల వెంకటేష్, నింబగల్లు సిద్దప్ప, ఆమిద్యాల సూరి, శంకర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## రోగాలకు ఆయుర్వేద మందుతో ఉపశమనం



ఆయుర్వేద మందు అందిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జూన్ 8 ప్రభాతవార్త**

దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద మందుతో ఉపశమనం లభిస్తుందని గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి అన్నారు. పట్టణంలోని గవిమఠ సంస్థానంలో మృగశిర కార్తె ఆదివారం మధ్యాన్నం దగ్గు, ఆయాసం, ఆస్తమా, ఉబ్బసంతో బాధపడుతున్న రోగులకు ఆయుర్వేద మందు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాధికారి మాట్లాడుతూ మందు తీసుకున్న వారు కొన్నిరోజులపాటు ఆహార నియమాలు పాటించాలని అప్పుడే మందు రోగాలపై ప్రభావంచూపి ఉపశమనం కలుగజేస్తుందన్నారు. కాగా ఆయుర్వేద మందు తీసుకోవడానికి పట్టణం నుండే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుండి కూడా రోగులు తరలివచ్చారు.

## బాలికపై అత్యాచారం చేసిన కీచకులను కఠినంగా శిక్షించాలి

### -వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్



**ఉరవకొండ, జూన్ 8 ప్రభాతవార్త**

రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో అభం శుభం తెలియని బాలికలపై అత్యాచారానికి ఒడిగట్టిన కీచకులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదరి ్శ, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఉరవకొండలో విలేఖరులతో మాట్లాడారు. 9వ తరగతి చదవుతున్న బాలికపై ఆగ్రామానికి చెందిన యువకులు కన్నేసి సభ్య సమాజం తలదించుకునే దురా ్మర్గానికి ఒడిగట్టటం అత్యంత దారుణమన్నారు. 14 మంది యువకులు వీడియోలు తీసి బెదిరిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ అత్యాచారానికి ఒడిగట్టడం దిగ్భ్రాంతిని కలిగిస్తోందన్నారు. అధికారం అండ ఉంది అడిగేవారు లేరని 6 నెలల పాటు కీచకపర్వం కొనసాగించడం విస్తుగొలుపుతోందన్నారు. . బాలిక గర్భం దాల్చడంతో అసలు విషయం బయటకొచ్చిందని దుప్పటి పంచాయతీచేసి కీచకులను కాపాడకుండా ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. మహిళల రక్షణ, ఆత్మగౌరవం గూర్చి పదే పదే మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై స్పందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా కీచకులను కఠినంగా శిక్షించాలని మల్లెల జగదీష్ డిమాండ్ చేశారు.

## రాచానపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బద్దెల మంజునాథ్

**అనంతపురం రూరల్, జూన్ 08 ప్రభాతవార్త**



గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు కార్యదర్శితో టిడిపి నాయకులు

అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బద్దెల మంజునాథ్, ఉపాధ్యక్షుడు హుస్సేన్,ప్రధాన కార్య దర్శిగా నారాయణస్వామి లను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నియమించారు. ఈ సందర్భంగా బద్దల మంజునాథ్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఎమ్మెల్యే పరిటాల సునీత, యువ నాయకులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థలు రాచనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షునిగా రెండవసారి నియమించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారి నమ్మకాన్ని ఉమ్ము చేయకుండా గ్రామంలోని నాయకులందరినీ కలుపుకొని కలిసికట్టుగా పనిచేసి రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేసి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నా ఎంపికకు సహకరించిన గ్రామంలోని నాయకులకు కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నియమితులై నవారికి రామ టిడిపి నాయకుడు కార్యకర్తలు పూలమాల వేసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్పీడ్ బ్రేకర్ వలన వర్షం నీరు అంతా మా ఇంటి లోకే

### స్పీడ్ బ్రేకర్ తొలగించండి సార్

**కనేకల్లు ప్రభాత వార్త జూన్ 08**

కనేకల్ మండల కేంద్రం దిగువ గేరిలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన రోడ్డుపై గల స్పీడ్ బ్రేకర్ ఉండడం వల్ల వర్షపు నీళ్లు , మురికి కాలువ నీళ్లు పోవడానికి ఇబ్బందికరంగా ఉంది. అందువల్ల ఆ నీళ్లు ఇంటి లోపలికి వస్తున్నాయి ఆ స్పీడ్ బ్రేకర్ ని తొలగించాలని ఆ కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ఆఫీస్ కి పదిసార్లు తెలియజేసిన గాని వారు పట్టించుకోవడం లేదనీ ఆ కాలనీ ప్రజలు తెలిపారు ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వర్షం మరియు మురికి నీరు ఇంటిలోకి రాకుండా స్పీడ్ బ్రేకర్ తొలగించే విధంగా చూడాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.

